యుగంధర్ కారులోంచి తొంగిచూసి క్షణాల్లో అలర్ట్ అయిపోయాడు.

లైట్స్ బాగా దగ్గరగా రానిచ్చి విజిల్ వేశాడు.

అంతే...

ఒక్కసారి పోలీసులంతా రోడ్డుమీదకు దూసుకుపోయారు. ఎనభై కిలోమీటర్ల స్పీడ్ తో దూసుకువస్తున్న లారీ సడెన్‌గా రోడ్డువారగా దిగి పోలీసులను తప్పించుకుని తిరిగి రోడ్డెక్కి ముందుకు దూసుకుపోయింది.

అంతా కనురెప్పపాటులో జరిగిన ఆ సంఘటనకు షాక్ తిన్న పోలీసులు చటుక్కున జీప్‌లోకి కొందరు, వ్యాన్‌లోకి కొందరు ఎగిరి దూకి లారీని చేజ్ చేయటం మొదలుపెట్టారు.

అప్పటికే యుగంధర్ అంబాసిడర్ బుల్లెట్‌లా సర్రున ముందుకు దూకింది.

అరగంట సాగిన ఆ చేజ్‌లో పోలీసుదే పై చేయి అయింది. యుగంధర్ కారు లారీని నేర్పుగా ఓవర్‌టేక్ చేసి ముందుకెళ్లి లారీని ఆపేసింది. తప్పనిసరి పరిస్థితుల్లో లారీ ఆగిపోయింది.

నలుగురు పోలీసులు చటుక్కున కేబిన్ దగ్గరకు వెళ్ళి డ్రయివర్‌ను, క్లీనర్‌ను కాలరు పట్టుకుని కిందకు లాగారు.

మరో పోలీస్ లారీ డ్రయివింగ్ సీట్లో కూర్చోని వెనక్కు తిప్పాడు.

గంట తర్వాత లారీ, పోలీస్ జీప్, వ్యాన్, కారు స్టేషన్ ముందాగాయి.

అప్పుడు సమయం తెల్లవారుజాము మూడుగంటలు కావస్తోంది.

యుగంధర్ ముందుగా ఆ లారీ ఎవరిదన్నది తేల్చుకున్నాడు. అది మధుమూర్తి పేరుమీద వుంది.

తెల్లవారేవరకు ఎలాంటి చర్యా తీసుకోకుండా అలాగే వుండిపోయాడు యుగంధర్. లారీని చెక్ చేయకుండా, ఎఫ్.ఐ.ఆర్ రాయకుండా, కేస్ ఫైల్ చేయకుండా ఎందుకలా ఆపాడో పోలీసులకర్థంకాక సతమతమయిపోతున్నారు.

సరిగ్గా ఉదయం ఆరుగంటలకు బిలబిలమంటూ దిగిపోయారు జర్నలిస్ట్‌లు. అందులో ఉష కూడా వుంది.

అప్పుడు లారీని ఓపెన్ చేయమని ఆజ్ఞాపించాడు ఎస్.పి. ఇద్దరు కానిస్టేబుల్స్ చకచక లారీ ఎక్కి టార్పాలిన్‌ని విప్పేసి, బ్యాక్ డోరు తెరిచారు.

లోపల వరుసగా, పొందికగా పేర్చిన పీపాలు కనిపించాయి.

"దొరికావు పట్టాభీ .... సరిగ్గా దొరికిపోయావు" అని మనసులో అనుకుంటూ "బ్రేక్ దోజ్ పీపాస్" అన్నాడు యుగంధర్.

అక్కడ గుమిగూడిన జర్నలిస్టులు అంతా యుగంధర్ ధైర్యానికి విస్తుపోయి చూస్తుండగా ఒక పీపా బ్రద్దలయింది, కాని ఎలాంటి ఆల్కహాల్ వాసన రాలేదు.

ఒక జర్నలిస్టు అనుమానంగా ముందుకు వంగి చూపుడువేలును పీపాలో నుంచి

ముక్కుదగ్గర పెట్టుకుని వాసన చూశాడు.

"దెబ్బ తిన్నారు సార్! పట్టాభి, మధుమూర్తులంత తేలిగ్గా మీకు దొరకరు సార్! ఇది దొంగసారా కాదు సార్! నీళ్ళు" అన్నాడు ఒక జర్నలిస్టు.

ముందు అతనేమన్నాడో అర్థం కాలేదు యస్.పి.కి. అర్థమయ్యాక అతని ముఖం వివర్ణమయింది. మిగతా పోలీసులు పాలిపోయిన మొఖాలతో దిష్టిబొమ్మల్లా నిల్చుండిపోయారు.

అంతలో లోపల ఫోన్ మోగింది.

ఒక కానిస్టేబుల్ పరిగెత్తుకుంటూ వచ్చి "మీకు అర్జంట్ ఫోన్ కాల్ సార్!" అన్నాడు.

నిస్పృహగా తల విదిలిస్తూ లోపలకు వెళ్ళి ఫోనెత్తాడు యుగంధర్ .

"ఎలా వుంది మన దెబ్బ?"

యుగంధర్ ఉలిక్కిపడ్డాడు. ఫోన్‌కి ఆ వేపున వుంది పట్టాభి అని గుర్తుపట్టాడు.

రెండోసారి కూడా ఘోరంగా అవమానింపబడ్డాడు యుగంధర్ .

ఎంత తెలివిగా తన్ను ఫూల్ చేశాడు పట్టాభి.

డ్యూటిలో జాయినయి రెండురోజులు పూర్తయ్యేలోపే రెండు ఎదురుదెబ్బలు.

ఆ ఇద్దరిపై పోలీస్ డిపార్టుమెంట్ తయారుచేసిన రెడ్ ఫైల్ లో వారిని యింకా తక్కువ అంచనా వేసినట్లుగా గ్రహించాడు యుగంధర్ .

అనవసరంగా తను ఆవేశంలో ఏదో ఘనకార్యం సాధించబోతున్నానన్న అహంతో వేసిన తప్పటడుగు లారీని పట్టుకోగానే చెక్ చేయకపోవటం.

ఇప్పుడు జర్నలిస్టులు పట్టాభి నిజాయితీ గురించి రాయకపోయినా తన తొందరపాటు గురించి తప్పక రాస్తారు.

ముక్కుసూటిగా వెళ్ళే తన తత్వం, విధానం తననిప్పుడు దెబ్బ తీసింది.

సో, భవిష్యత్‌లోనయిన తన పోరాట విధానాల్ని మార్చుకోవాలి. తప్పదు.

ఆలోచిస్తూనే బయటకొచ్చి "మీకు శ్రమ కలిగించినందుకు క్షంతవ్యుణ్ని" అన్నాడు జర్నలిస్టులకేసి చూస్తూ.

అప్పుడు ముందుకొచ్చింది ఉష "శత్రువు చాలా తెలివయినవాడు మిస్టర్ ఎస్.పి. చాలెంజ్ చేసి మరీ మిమ్మల్ని అసమర్థులుగా నిరూపించేందుకు సిద్ధంగా వున్నాడు. ఆ విధంగా మిమ్మల్ని ట్రాన్స్‌ఫర్ అన్నా చేయిస్తాడు. లేదా తను కొట్టిన దెబ్బలకి మీరు మానసికంగా దెబ్బతిన్న సమయం చూసి మీతో బేరమైనా చేస్తాడు.

ఇక్కడున్న మా జర్నలిస్టులందరికీ తెలుసు వాళ్ళలాంటి వాళ్ళయినది. కాకపోతే మీరేదన్నా సాక్ష్యాధారాలు చూపిస్తారేమో పత్రికల ద్వారా తూర్పారపడదామని వచ్చాం. మొన్న లాటరీ తీసిన విధానం కూడా మాయే. ఇకనుంచయినా అప్రమత్తంగా వుండండి" అని యుగంధర్‌కి వినిపించేలా అని "ఇట్సాల్‌రైట్ మిస్టర్ ఎస్.పి. పొరపాట్లు సహజం, మీ నిజాయితీకి, నిర్భీతికి అభినందిస్తూ తొందరపాటు చాలా అనర్థాలకు దారితీస్తుందని ఫ్రెండ్లీగా ఎడ్వయిజ్

చేస్తూ శెలవు తీసుకుంటున్నాం" అంది ఉష.

జర్నలిస్టులు వెనుదిరిగారు.

మరి కొద్దిక్షణాలకే ఆ లారీని, దానికి సంబంధించిన మిగతా సిబ్బందిని విడుదల చేయమని చెప్పి తన బంగ్లాకేసి సాగిపోయాడు యుగంధర్ .

ప్రతిరోజూ ఉదయం ఉష వుండే వీధి మొదట్లో నిల్చుంటాడు ఉదయ్. ఆమె సరిగ్గా పదిగంటలకు బయటకు వచ్చి ఉదయ్‌ని కలుస్తుంది. ఇద్దరూ అక్కడినుంచి రెండు కిలోమీటర్ల దూరంలోవున్న పత్రికా ఆఫీసుకి వెళతారు.

ఆమె లోపలకు వెళ్ళగానే ఉదయ్ బయటే వుండిపోతాడు. ఏ రోజూయినా బయట రిపోర్టింగ్‌కి వెళ్ళే ప్రోగ్రామ్ వుంటే ముందుగానే ఉదయ్‌కి తెలియపరుస్తుంది ఉష.

యుగంధర్ ఎస్.పి.గా చార్జిషీటు తీసుకున్న వారానికి సర్కిల్ అక్కడకు పోస్టు చేయబడ్డాడని పోలీసు డిపార్టుమెంట్ అంతా భావించింది.

"ఏ మాత్రం అనుమానం రాని రీతిగా ఎంటర్ అయ్యావు, అదే ఫిలిం వుండేలా ప్రవర్తించు. ఈ రోజునుంచే నువ్వు మధుమూర్తి, పట్టాభిల కార్యకలాపాలపై నిఘావేసి వుంచు. ఏమాత్రం అనుమానం వచ్చినా ముందుగా పక్కా సాక్ష్యం కోసం ప్రయత్నించు..." యుగంధర్ నెమ్మదిగా చెప్పాడు.

"ఓ.కే సార్. బట్...." సర్కిల్ సందేహించాడు.

"చెప్పు, ఫర్వాలేదు"

గౌసుద్దీన్ ఇంట్లో దొంగతనం చేసినందుకు ఉదయ్‌కి వాళ్ళ ఇంటి అడ్రసు వెతికిపట్టుకుని ఇస్తానని నేను ప్రామిస్ చేశాను. కనింత వరకు ఆ పని చేయలేకపోయాను. అందుకు కారణం, నేను నియమించిన ఇద్దరు కానిస్టేబుల్స్ ఫెయిల్ కావటమే, అతనిప్పుడు ఇక్కడే వుంటున్నాడు. ఏక్షణాన అతనెదురయి నిలదీసినా నేను ఇబ్బందిలో పడిపోతాను"

యుగంధర్ కొద్దిక్షణాలు మౌనంగా వున్నాడు "మరో పది రోజులు గడువు అడుగు, ఈ లోపు యిద్దరు సి.ఐ.డి. కానిస్టేబుల్స్‌ను ఆ పనికి పురమాయిద్దాం."

సర్కిల్ మౌనంగా తలూపాడు.

"అడ్రసు కనుక్కునే పని సులువు కావాలంటే ఉదయ్‌ని కలిసి వాళ్ళ నాన్న పేరు, ఇంక తోడబుట్టిన వాళ్ళెవరయినా వుంటే వాళ్ళ వివరాలు తీసుకో. క్విక్ వెంటనే ఆ పని పూర్తయిపోవాలి. మరో విషయం ఉదయ్‌లాంటి ఇంటలిజెంట్‌ని దగ్గరకు తీస్తే మన డిపార్టుమెంట్‌కు మేలు జరగవచ్చు. ఇప్పుడతనేం చేస్తున్నది? చేయాలనుకుంటున్నది కూడా తెలుసుకో."

"ఓ.కే సార్!" సర్కిల్ సెల్యూట్ చేసి బయటకెళ్ళిపోయాడు.

"భలే దెబ్బ కొట్టావే పట్టాభి! నీది పెద్ద క్రిమినల్ బుర్రకాయ--దాన్ని తీసి ఇంటర్‌పోల్ పరిశోధనకి పంపించాలి" మధుమూర్తి ఫోన్‌లో పట్టాభితో అన్నాడు.

"యూ స్టుపిడ్! ఫోన్‌లో యిలాంటి విషయాలు మాట్లాడవద్దని లక్షసార్లు చెప్పాను. బై ది బై ఓకంట ఆ లేడీక్రైమ్ రిపోర్టర్ ఉషని, ఈ ఎస్.పి ని కనిపెట్టుకుని వుండు. పగబట్టిన చిరుతపులులు మాటేసి వుంటాయి మన కార్యకలాపాల్ని కాటేయటానికి.

ఇకపోతే ఫైనాన్స్ కంపెనీ టార్గెట్ కనీసం యాభైలక్షలు. ముందు ఆ పని చూడు. నువ్వో నాలుగయిదు స్కీమ్స్‌లో చేరిపో. జాగ్రత్త. ఆ అమ్మాయి కన్ను మన కంపెనీమీదుంది" ఫోన్ కట్ అయింది.

మధుమూర్తికి ఆనందంగా వుందిప్పుడు.

0 0 0 0

ఎప్పటిలాగే ఉదయ్ తొమ్మిది నలభైకి వచ్చి ఉష వుంటున్న వీధి మొదట్లో ఎలక్ట్రిక్ పోల్ క్రింద నించున్నాడు.

9-46....

9-47....

క్షణాలు, నిమిషాలయి పోతుండగా దూరంగా కలకలం వినిపించింది ఉదయ్‌కి. ఉలికిపాటుగా అటుకేసి చూసాడు.

ఆ వీధిని కలిపే మరోవీధి మధ్యలో ఒక ఆటో ఆగివుంది. దాని ప్రక్కనే ఓ యువతి నిల్చుని వుంది. ఆమెకు ఎదురుగా నలుగురు వ్యక్తులున్నారు.

చూస్తున్న దాన్నిబట్టి వారిమధ్య ఏదో ఘర్షణ జరుగుతోందని అర్థం చేసుకున్న ఉదయ్ వేగంగా అక్కడికి వెళ్ళేసరికి అసలు విషయం అర్ధమైంది.

"వీర ఝాన్సీరాణీలా ఎగిరిపడ్డావ్‌గదా? ఇప్పుడు నిన్నెవడు రక్షిస్తాడు? పోలీసులా? న్యాయస్థానమా?" అంటూ ఒకడు ఉత్కళకు అతి సమీపంగా వెళ్ళాడు ధీమాగా.

ఆటో డ్రయివర్‌కి భయంతో చెమటలు పట్టేశాయి.

ఉత్కళ ఊహించని పరిణామంయిది.

కళ్ళు, చేతులు ఆడనట్లుగా అనిపించిందామెకి.

"మమ్మల్ని జైలుకి పంపిస్తావా? మేమేనా ఈ దేశంలో తప్పు చేస్తున్నది? మేం వ్యక్తిగత సంపదల్ని కొల్లగొడతాం. మరి రాజకీయనాయకులు? రాష్ట్రాల్ని, దేశాన్ని దోచుకుతింటున్నారు. నమ్మించి ప్రజల్ని మోసం చేస్తున్నారు. వాళ్ళనేం చేయలేక మామీద విరుచుకు పడతావా? నిన్నిక్కడే దెబ్బతీస్తాం. నీ పరువుతో ఆటాడుకుంటాం. రమ్మను ఎవడొస్తాడో?" అంటూ మరొకడు ఆమెకు సమీపంగా వచ్చాడు.

డ్రయివర్ గజగజ వణికిపోసాగాడు.

ఉత్కళ చుట్టుప్రక్కలకు చూసింది. ఒక్కరూ లేరు వీధిలో. అందరూ భయంతో లోపలకు దూరి తలుపులేసుకున్నట్లుగా గ్రహించి ఖిన్నురాలయింది.

ఒకింత దూరంలో వున్న ఉదయ్ ఆమెకి క్షణంలో ప్రత్యక్షమయిపోయాడు.

ఆమె చూపుల్ని అర్ధం చేసుకున్నట్లు ఉదయ్ ఆటో దగ్గరకు వచ్చాడు.

"వీళ్ళు మిమ్మల్ని థ్రెటన్ చేస్తున్నట్లుగా వుందే? మిమ్మల్ని నేను రక్షిస్తాను. మూడొందలిస్తారా?" అన్నాడు ఉదయ్ భావరహితంగా.

ముందు ఉదయ్ అన్న మాటలు ఉత్కళకు అర్ధంకలేదు. అర్ధం కాగానే విస్తుపోయింది.

"త్వరగా చెప్పండి. నాకవతల చాల పనుంది. మీరు పేదవాళ్ళయి వుంటే ఉచితంగానే రక్షించేవాడ్ని... కానీ మీ కట్టు, బొట్టు, వేషధారణ చూస్తుంటే కాస్త వున్నవాళ్ళలాగే కనిపిస్తున్నారు. త్వరగా తేల్చండి" అన్నాడు పక్కా వ్యాపారస్తుడిలా ఉదయ్.

ఆటో డ్రయివర్ వెంటనే రియాక్ట్ అయి ఒక్క అంగలో ఉదయ్‌ని సమీపించి అతని చేతులు పట్టుకుని "బాబ్బాబు ఆ పనిచేసి పుణ్యం కట్టుకోండి" అన్నాడు ప్రాధేయపడుతున్నట్లుగా.

"పుణ్యాలు, పాపాలు మోసే ఓపికా, ఆసక్తి నాకు లేవు. డబ్బు మాత్రం మోయగలను. అడుగు, మీ మేడమ్ డబ్బు ఇస్తుందేమో అడిగిచూడు" అన్నాడు ఉదయ్ తన చేతుల్ని విడిపించుకుంటూ.

అప్పటివరకూ వెర్రిగా చూస్తున్న ఆ నలుగురిలో పట్టరాని ఆగ్రహం చోటుచేసుకుంది.

"నువ్వెవడివిరా మధ్యలో? రివటలా వున్నవ్. నువ్వు మమ్మల్ని అడ్డుకుని దీన్ని కాపాడతావా? తిక్క తిక్కగా వుందా?" అంటూ ఒకడు ఉదయ్ మీదకు వచ్చాడు.

"త్వరగా తేల్చండి...మూడొందలిస్తారా? నా దారిన నన్నెళ్ళి పోమంటారా?" ఉదయ్ అసహనంగా అడిగాడు మీదకు వచ్చిన వ్యక్తిని లెక్కచేయనట్లుగా.

ఇలంటి వాళ్ళు కూడా వుంటారా అన్న ఆశ్చర్యంలోంచి మెల్లగా తేరుకుంది ఉత్కళ.

"ఎంత ధైర్యంరా నీకు? మా ముందే... మమ్మల్ని గడ్డిపరకల్ని చేసి రేటు మాట్లాడుకుంటావా?" అంటూ మరోడు మీదకు రాగా నిర్లక్ష్యంగా అతన్ని తోశాడు ఉదయ్.

ఊహించని ఉదయ్ చేతి విసురుకు ఆ వ్యక్తి దబ్బున నేలమీద పడ్డాడు.

మీసాలయిన నిండుగా రాని ఈ యువకుడు తననేం రక్షించగలడని అప్పటివరకు ఆలోచిస్తున్న ఉత్కళ క్రింద పడిపోయిన వ్యక్తిని చూసి---- "సరే" అంది వెంటనే.

అప్పటికే సిద్ధమయివున్న మిగతా ముగ్గురూ ఒక్కసారి ఉదయ్ మీదకు దూకారు.

ఏ మాత్రం తొట్రుపడకుండా, కంగారు పడకుండా తాపీగా కేవలం మూడు నిమిషాల్లో ఆ నలుగుర్ని చితకబాదేశాడు ఉదయ్.

ఇతనిలో ఇంత ఒడుపు, బలం, వేగం దాగున్నాయా అని అక్కడున్న ఆరుగురు ఆలోచిస్తుండగా---

"నాకు రావల్సింది ఇచ్చేయండి" అన్నాడు ఉదయ్ అంతకు ముందేమీ జరగనట్లుగానే ప్రవర్తిస్తూ.

శిలాప్రతిమయిపోయి ఉన్న ఉత్కళ పర్సులోంచి తనే మూడొందలు తీసుకుని ఆ

నలుగుర్ని అక్కడినుంచి పారిపోయేలా చేసి ఎలక్ట్రిక్ పోల్ కేసి నడిచాడు ఉదయ్.

జరిగింది ఐదునిమిషాలకుగాని జీర్ణం కాలేదు ఉత్కళకు.